క్లుప్తంగా

ఆర్మీ జవాన్‌కు సత్కారం



ఆర్మీజవాన్ దంపతులకు భారతమాత చిత్రపటాన్ని అందజేసిన రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: బీజేపీ కేంద్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు ఫతే నగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ వీరులకు వందనం కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొని దేశానికి సేవలు అందించిన ఆర్మీ జవాన్, స్పెషల్ పోలీస్ ఆఫీసర్ శ్రీనివాసులను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం భారతమాత చిత్రపటానికి, జాతీయ పతాకాన్ని శ్రీనివాసులకు అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్వన పల్లి సూర్యారావు, బీజేపీ నాయకులు సురేంద ర్‌రెడ్డి, తులసిరామ్, అభిలాష్‌యాదవ్, సాయి, ఫణి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



సాయినగర్ ఈస్ట్ కాలనీలో మొక్కలు నాటుతున్న సురభి రవీందర్‌రావు, బీజేపీ నేతలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, సాయినగర్ ఈస్ట్ కాలనీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు ఆధ్వర్యంలో స్వతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ మొక్కలు నాటే కార్యక్రమానికి పిలుపునివ్వగా బీజేపీ సీనియర్ నాయకుడు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కో ఆర్డినేటర్ కుమార్ యాదవ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆర్‌కే చారి, నరసింహారెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కళ్ల అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు ప్రేమకుమార్, నాయకులు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం ముమ్మారెడ్డి ప్రేమకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ డివిజన్లలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి సూచన మేరకు బాలాజీనగర్ డివిజన్‌లో కంటి అద్దాలు అందజేశారు. మూసాపేట కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నాయకులు పద్మయ్య, డివిజన్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, శైలేష్‌కుమార్, వినోద్, రామ్, కిషోర్‌కుమార్, లహరి, రవిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు స్థానిక సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించి శంభీపూర్‌రాజు సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నియామకం

దుండిగల్: కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్‌గా పోషి మహేశ్ ముదిరాజ్ నియమితులయ్యారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సోమవారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్‌కు నియామక పత్రా న్ని అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేలా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, చిందకింది సురేశ్, మిద్దెల సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్‌గా అబ్దుల్ రహమాన్‌ఖాన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వినయ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకా, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అధికారులు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు



పంచశీల స్కూల్‌లో..



ప్రశాంత్‌నగర్‌లోని ట్వింకల్ స్టార్స్ స్కూల్ విద్యార్థులు

కూకట్‌పల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మువ్వన్నెల జెండాలను చేతబూని భారతమాతాకి జై అంటూ నినదించారు. ప్రశాంత్‌నగర్‌లో ట్వింకల్ స్టార్ స్కూలులో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ట్వింకల్ స్టార్స్ స్కూల్ డైరెక్టర్ డా. గోకుల్ కుమార్, కరస్పాండెంట్ విజయలక్ష్మి, గోకుల్, అశోక, ఇన్‌చార్జి సునీతసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు. మూసాపేటలోని పంచశీల పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి చిన్నప్పటి నుంచి తెలుసుకోవాలని కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ తెలిపారు. కేపీహెచ్‌బీకాలనీ 6వ ఫేజ్‌లోని నెక్స్‌జెన్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నెక్స్‌జెన్ స్కూల్‌లో..

అర్హులందరికీ ‘డబుల్’ ఇళ్లు అందిస్తాం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు హారతి ఇస్తున్న మహిళలు

మూసాపేట/బాలానగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి సోమవారం పాదయాత్ర నిర్వహించారు. అమృతనగర్ తండా, దీన్‌దయాల్‌నగర్, జింకలవాడ, హెచ్‌పీ రోడ్, సమతానగర్, వేంకటేశ్వరనగర్, భవానీనగర్, కార్మికనగర్‌లలో పాదయాత్ర చేస్తూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. ఫతేనగర్‌లోని నిరుపేదలు ఎక్కువగా ఉండే ప్రాంతాలైన దీన్‌దయాల్‌నగర్, అమృతనగర్ తండా, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారని అర్హులందరికీ త్వరలోనే అందిస్తానని వారికి హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కూకట్‌పల్లి: దీనబంధు కాలనీలో ప్రజా సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొంత మేర సీసీ రోడ్డు నిర్మాణం జరగలేదని, వీధి దీపాలు సరిగ్గా వెలగటం లేదని, డ్రైనేజీ వ్యవస్థ మంచిగా లేదని, మ్యాన్‌హోళ్లు దిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎస్వీ శెట్టి, బీఆర్‌ఎస్ నాయకులు నాయుడు, వెంకటయ్య, గిరీ, మహేష్, కృష్ణ, సతిరెడ్డి, సదా, నాగన్న, శ్రీహరి, బాలు పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలను పంపిణీ చేసిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

మోతీనగర్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలన్న ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు సోమవారం అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్, వివేకానందనగర్, తులసీనగర్, పర్వత్‌నగర్, రామారావునగర్, గణేష్‌నగర్, రాధాకృష్ణ నగర్, హరినగర్ బస్తీవాసులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అదే విధంగా పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ ముదిరాజ్, అల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బొంత హరికృష్ణ, ఓబీసీ మోర్చా అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి భాను, సోషల్ మీడియా అధ్యక్షుడు అభిషేక్, పాల శ్యామ్, జమల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ భూమి కబ్జాదారుల చెరలో చిక్కుకుందని బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో ఐదెకరాల గ్రేవీ, డంపింగ్ యార్డ్ స్థలాన్ని శంషుగూడ సర్వే నెంబర్ 57గా కోర్టు ఆర్డర్ చూపిస్తూ గాజులరామారం సర్వేనెంబర్ 304, 305, 307, 171 ప్రభుత్వ భూమి 92 ఎకరాలు ఆక్రమించారంటూ సోమవారం జరిగిన ప్రజావాణిలో బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రగతినగర్ డంపింగ్ యార్డ్, గ్రేవ్‌యార్డ్‌లను కబ్జా చేయడంతో పాటు ఆస్తుల నేలమట్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో రామచంద్ర నాయక్, కౌశిక్ నాయుడు, సాయిరెడ్డి, నరసింహ రెడ్డి, కుంకి రాము, కుమార్‌గౌడ్, విజయ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’

సుభాష్‌నగర్: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సోమవారం దండేరాజు ఆధ్వర్యంలో చంద్రగిరినగర్‌కు చెందిన పవన్, మల్లేష్, మలింగ, హనుమంతు తమ మిత్ర బృందం వంద మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆలోచనా విధానాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, రాష్ట్రంలో ప్రజల ఆదరణ చూస్తుంటే మెజార్టీ సీట్లను కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంటుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లాల్ మహ్మద్, మండవ శివకుమార్, రాజారెడ్డి, రాజ్‌కుమార్, జలీల్, విశాల్ పాల్గొన్నారు.



కళలు సమాజాన్ని జాగృతం చేస్తాయి

భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాదాపూర్: కళలు వినోదాన్ని మాత్రమే కాదు విజ్ఞానాన్ని అందిస్తాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం కుమారి యెర్నేని లేఖ భరతనాట్య అరంగేట్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ భారతదేశం కళల కాణాచి అని అన్నారు. కళలు మన పెద్దలు మనకు అందించిన విలువైన కానుకలని వాటిని ముందు తరాలకు అందించాలని తెలిపారు. ఇలాంటి భారతీయ కళలను పాఠ్యాంశాలలో భాగం చేసి విద్యార్థులకు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆధునిక కాలంలోను సాధన చేస్తు కుమారి యెర్నేని లేఖ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభినందించారు. పాఠాలను కళలతో కలిపి నేర్పించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి పాల్గొన్నారు.

ప్రొ. గిరిధర్‌కు ఎట్ హోంకు ఆహ్వానం



బాలానగర్: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రొఫెసర్ ఎంవీఎస్ఎస్ గిరిధర్‌కు యూనివర్సిటీ ఛాన్సలర్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. గవర్నర్ నివాసంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎట్ హోం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ప్రొ. గిరిధర్ యూనివర్సిటీలో వాటర్ రీసోర్స్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. గిరిధర్ ఆధ్వర్యంలో వాటర్ హార్వెస్టింగ్ జేఎన్‌టీయూలో నెలకొల్పి వాటర్ రీసోర్స్ విషయాలపై దేశంలోని పలు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఆచార్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు.

అదనపు నిధులు కేటాయించాలి

జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌ను ఎమ్మెల్యే గాంధీ సోమవారం కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలు సమస్యలు, పరిష్కరించాల్సిన అంశాలు, అభివృద్ధి పనులపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో నీటి సమస్య, అసంపూర్తి మంచినీటి పైప్‌లైన్ పనులకు అదనపు నిధులు కేటాయించాలని కోరారు. మంచినీటి సరఫరా సమయం పెంచాలని కోరారు. ఈ అంశాలపై దానకిషోర్ సానుకూలంగా స్పందించారు. సీవరేజ్ సమస్యల పరిష్కారానికి దశలవారీగా నిధులు కేటాయించేందుకు అంగీకరించారని తెలిపారు.

బండరాయి తొలగింపు



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేనగర్ రోడ్డు నెంబర్-9, మసీద్ వద్ద ఎంతో కాలంగా ఉన్న పెద్ద రాయి అడ్డుగా ఉన్నందున స్థానికుల అభ్యర్థన మేరకు స్పందించి కెమికల్ కటింగ్ జరుగుతున్న పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులకు ఇబ్బంది కలుగకుండా రాయిని తొలగించాలని, ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు పక్కన ఉన్న రాయి అడ్డుగా ఉన్న స్థలాన్ని పరిశీలించి రాయిని తొలగించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ఏఈ శ్రీనివాస్, బందప్పు, భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్, శారద, స్థానికులు పాల్గొన్నారు.

కథనం చదివి.. పరిష్కారానికి కదిలి



సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాపూనగర్ రోడ్డు నెంబరు-4లో గోదావరి జలాల మ్యాన్‌వాల్వ్‌ను ఏ ర్పాటు చేసేందుకు జలమండలి సిబ్బంది గొయ్యి తీసి వదిలేశారు. గొయ్యి కారణంగా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోయారు. ఈ సమస్యపై ఈ నెల 5న సాక్షిలో ‘గొయ్యి తీసి..పత్తా లేకుండా పోయారు’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మ్యాన్‌వాల్వ్‌ను నిర్మించి దానిపై మూత ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

దేవాలయానికి విరాళం అందజేత

దుండిగల్: దుండిగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న రాజరాజేశ్వరీ పోచమ్మ దేవాలయానికి అక్షయ వాసుశ్రీ ప్రైడ్ యాజమాన్యం రూ.5 లక్షల విరాళం అందజేసింది. శంభీపూర్‌లో సోమవారం కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ సమక్షంలో అక్షయ ప్రైడ్ యజమాని సర్గారి జీవేందర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొర్ర శంకర్ నాయక్ చౌహాన్, బండారి మహేందర్ యాదవ్, భరత్‌కుమార్, నేతలు నల్లూరి కృష్ణ, శ్రీనివాస్, రవిందర్ నాయక్, హన్మంతు, వెంకటేశ్ పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో జైపూర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం జరి జైపూర్ ఎగ్జిబిషన్‌ను నటి వర్ష నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నటి కామాక్షి భాస్కర్, తెలంగాణ 2023 మిస్ ఇండియా ఊర్మిళా చౌహాన్, జరి జైపూర్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు రిషబ్ సోకియాలు పాల్గొన్నారు. చీరలు, లెహంగాలు, కుర్తీస్, సల్వార్‌లతో పాటు మరిన్ని ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కులమతాల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ యత్నం

- ఏ రాష్ట్రంలో లేని పథకాలు తెలంగాణలోనే అమలు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీజేపీ పార్టీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. బాలాజీనగర్ డివిజన్‌లోని బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, సాయికిరణ్, శాంతికుమార్, మురళితో పాటు దాదాపుగా 300 మంది సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కృష్ణారావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ దేశంలో 18 రాష్ట్రాల్లో ఉందని నిరుపేద ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే ఏమన్నా ఆర్థిక సాయం చేస్తోందా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు శాంతి భద్రతలు, మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ అనేక కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టి లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. బీజేపీ పార్టీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవడం తప్ప దేశానికి చేసిన ఒక్క మంచి పని కూడా లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పులు, ఉప్పులు వంటి నిత్యావసర ధరలు పెరిగిపోయి సామాన్యుల బతుకుభారంగా మారిందన్నారు. యువత మేలుకోకపోతే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు ఎక్కడైనా ఇస్తున్నాయని అని పరిశీలించుకోవచ్చని సూచించారు.అదే విధంగా జిల్లా ఎస్సీ మోర్చా కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ బీఆర్‌ఎస్ చేరారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, కూకట్‌పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరి వెంకటేష్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, గోనె శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావు

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచన మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు స్వయంగా ఆయన నివాసంపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ దేశానికి ఉన్న ఏకైక గుర్తు, బలం, ఆత్మ గౌరవానికి ప్రతీక ఈ జాతీయ జెండా అని పేర్కొన్నారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం కూడా అదే స్ఫూర్తిని కొనసాగించటం హర్షణీయమన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి గౌరవ సూచకంగా కొనసాగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, అదే విధంగా సోషల్ మీడియా డీపీలు సైతం జాతీయ జెండాలతో మార్చాలని తద్వారా భారతదేశ చరిష్మా పౌరుల ఐక్యత ప్రపంచ దేశాలకు చాటేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మాధవరం కాంతారావు

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆల్విన్‌కాలనీ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్ పాల్గొన్నారు.



బాలికపై అత్యాచారం

వ్యక్తిపై కేసు నమోదు

జగద్గిరిగుట్ట: బాలికపై అత్యాచారం జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ, ఎన్‌టీఆర్ నగర్‌లో పాఠశాలకు వెళ్తున్న బాలికపై స్థానికంగా ఉండే సంజీవ్ కుమార్ నోట్లో గుడ్డలు కుక్కిపలుమార్లు అత్యాచారం చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని కత్తితో బెదిరించాడు. ఆ బాలిక భయపడి ఎవ్వరికి చెప్పలేదు. ఇది జరిగి రెండు నెలలు కావస్తోది. అయితే.. బాలిక నెలసరి సరిగా కాకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

బిందుశ్రీ ఆత్మహత్య కేసులో ఇంటి యజమాని రిమాండ్

గచ్చిబౌలి: పనిమనిషి బిందుశ్రీ ఆత్మహత్య కేసులో ఇంటి యజమాని ఆచర్ల పూర్ణచంద్రరావును రిమాండ్‌కు తరలించిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిందుశ్రీ కుటుంబం, హోంథియేటర్స్ బిజినెస్ చేసే పూర్ణచంద్రరావులది కాకినాడే కావడంతో పాత పరిచయం ఉంది. 2017 నుంచి పూర్ణచంద్రరావు ఇంట్లో పనిచేస్తూ పిల్లలకు కేర్ టేకర్‌గా అక్కడే ఉంటోంది. ఇద్దరి మధ్య సన్నిహిత్యం పెరిగి సహజీవనానికి దారితీసింది. ఇంట్లోనే ఉంటున్న పూర్ణచంద్రరావు భార్యకు, బిందుశ్రీకి తరచు గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున మద్యం సేవించిన బిందుశ్రీ హాల్‌లో కేకలు వేయడంతో పూర్ణచంద్రరావు భార్య బయటకు వచ్చింది. ఇద్దరు గొడవ పడటంతో పూర్ణచంద్రరావు జోక్యం చేసుకున్నాడు. మాటామాట పెరిగి బిందుశ్రీపై చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బిందుశ్రీ 21వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఫిల్మ్ చాంబర్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న బిందుశ్రీ తనకు పరిచయమైందని, రైటర్‌గా తనకు సభ్యత్వం ఉందని నిందితుడు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. ఇదిఇలా ఉంటే ప్లాట్ ఇప్పిస్తాననడంతో బిందుశ్రీ కుటుంబసభ్యులు కొంత డబ్బు ఇచ్చినట్టు పోలీసుల విచారణలో తెలిసినట్టు సమాచారం. సినిమాలో అవకాశం ఇస్తానని మోసం చేసినట్టుగా వస్తున్న వార్తల్లో నిజం లేదని సీఐ మహేష్ పేర్కొన్నారు. నిందితుడిపై ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132